## నాట్కో ప్రాఫిట్ డౌన్

హైదరాబాద్, ఫిబ్రవరి 12: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ సంస్థ నాట్కో ఫార్మా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కంపెనీ రూ.132.4 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ .212.7 కోట్ల లాభంతో పోలిస్తే 37.75 శాతం తగ్గిందని పేర్కొంది. ఫార్ములేషన్ ఎగుమతులు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.758.6 కోట్ల నుంచి రూ.474.8 కోట్లకు పడిపోయింది. నిర్వహణ ఖర్చులు రూ.487.4 కోట్లకు తగ్గినప్పటికీ లాభాలు తగ్గుముఖం పట్టాయి. ఫార్ములేషన్ ఎగుమతులు రూ.605.6 కోట్ల నుంచి రూ.285.8 కోట్లకు తగ్గడం లాభాలపై ప్రతికూల ప్రభావం చూపిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.1.50 మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది.



## ఐఐటీతో ఎస్ఈఐఎల్ ఎనర్జీ జట్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 12: దేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్.. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా కీలక ముందడుగు వేసింది. కార్బన్ క్యాప్చర్ టెక్నాలజీ(బొగ్గు పులుసు వాయువును సంగ్రహించే సాంకేతికత) అభివృద్ధి చేయడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)–మద్రాస్‌తో చేతులు కలిపింది. ఈ వినూత్న ప్రాజెక్ట్..కార్బన్ క్యాప్చర్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే పెటెంట్ కలిగిన కీమోజెల్ అనే నానో పార్టికల్ ఆధారిత ద్రావకాన్ని ఇప్పటికే సృష్టించింది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కీమోజెల్ పనితీరును పరీక్షించేందుకు ఒక పైలెట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ విప్లవాత్మక పరిశోధనకు మద్దతుగా ఎస్ఈఐఎల్ రూ.71 లక్షల నిధులను కేటాయించింది.

# 536 సెక్షన్లు.. 16 షెడ్యూళ్లు

**622 పేజీలతో కొత్త ఆదాయ పన్ను బిల్లు • నేడు పార్లమెంట్‌కు తెస్తున్న కేంద్రం**

**అసెస్‌మెంట్ ఇయర్ స్థానంలో ట్యాక్స్ ఇయర్ • వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: కొత్త ఆదాయ పన్ను (ఐటీ) బిల్లు 2025ను కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్నది. 1961 ఆదాయ పన్ను చట్టంలోని కఠిన నిబంధనలు, పదాలు, వివరణల్ని సరళతరం చేస్తూ ఈ బిల్లును తెస్తున్నామని మోదీ సర్కారు చెప్తున్న విషయం తెలిసిందే. ఇక ఇందులో ఎటువంటి కొత్త పన్నుల విధింపు ఉండబోదంటున్న కేంద్రం.. సంక్లిష్టంగా ఉన్న అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై), ప్రీవియస్ ఇయర్ (పీవై) స్థానంలో 'ట్యాక్స్ ఇయర్' కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రకటిస్తున్నప్పుడే ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కొత్త ఐటీ బిల్లును తెస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్న సంగతి విదితమే. నిజానికి గత ఏడాది జూలైలో ప్రకటించిన బడ్జెట్‌లోనే ప్రస్తుత ఐటీ చట్టం 1961 సమగ్ర సమీక్షను మంత్రి తెరపైకి తెచ్చారు. అందుకు తగ్గట్టే కొత్త బిల్లును మంత్రి సీతారామన్ తీసుకొస్తున్నారు.




### పెరిగిన సెక్షన్లు, షెడ్యూళ్లు

దాదాపు 65 ఏండ్ల కిందటి ఐటీ చట్టాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో సరళీకరిస్తామని చెప్తున్న కేంద్రం.. మునుపటితో పోల్చితే కొత్త దాంట్లో సెక్షన్లు, షెడ్యూళ్లను పెంచడం గమనార్హం. 622 పేజీల్లో 526 సెక్షన్లు, 16 షెడ్యూళ్లతో కొత్త ఐటీ చట్టం రాబోతున్నది మరి. కానీ ఇప్పుడున్నదాంట్లో 880 పేజీల్లో 298 సెక్షన్లు, 14 షెడ్యూళ్లే ఉన్నాయి. చాప్టర్లు మాత్రం ఇప్పుడు, రాబోయేదాంట్లో 23గానే ఉన్నాయి. ఇక స్టాండింగ్ కమిటీ, పార్లమెంట్ ఆమోదం పొందితే వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త ఐటీ చట్టం అమల్లోకి రాబోతున్నది. కాగా, ఈ ఐటీ చట్టం సమీక్షపై భాగస్వాముల నుంచి 6,500 సలహాలు, సూచనల్ని కేంద్ర ప్రభుత్వం అందుకున్నది.

- 622 పేజీల్లో 536 సెక్షన్లు, 23 చాప్టర్లు, 16 షెడ్యూళ్లు.
- ప్రస్తుతం ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు అసెస్‌మెంట్ ఇయర్‌గా ఉండగా.. కొత్త బిల్లులో ట్యాక్స్ ఇయర్‌గా మార్చారు.
- వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఇతరుల కోసం కొత్త, పాత ఆదాయ పన్ను విధానాలకు వర్తించేలా చట్టం.
- సరళతరమైన భాష, చిన్నచిన్న వాఖ్య నిర్మాణాలు, అనవసరమైన నిబంధనల తొలగింపు.
- ప్రస్తుత చట్టంలో చాలాసార్లు కనిపించే 'నాట్‌విత్‌స్టాండింగ్' పదం స్థానంలో 'ఇర్రెస్పెక్టివ్' పదాన్ని చేర్చారు.
- సాధారణ పన్ను చెల్లింపుదారులూ చదువడానికి వీలుగా టేబుల్స్, ఫార్ములాలు.
- ఒకేచోట జీతాల్లో స్టాండర్డ్ డిడక్షన్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి తగ్గింపులు. మునుపు వివిధ సెక్షన్లు, రకరకాల నిబంధనల్లో ఇవి ఉండేవి.
- మార్కెట్ ఆధారిత డిబెంచర్లలో మూలధన లాభాల కంప్యూటేషన్ కోసం ప్రత్యేక ప్రావిజన్లు.

### నిపుణులేమంటున్నారు?

పన్ను చట్టాలను సరళతరం చేస్తూ, న్యాయపరమైన వివాదాలను తగ్గించడమే లక్ష్యంగా కొత్త ఆదాయ పన్ను చట్టాన్ని తెస్తున్నారని ట్యాక్స్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. మరింత పారదర్శకంగా నిబంధనల్ని రూపొందించి, ట్యాక్స్‌పేయర్ ఫ్రెండ్లీగా ప్రవేశపెడితే బాగానే ఉంటుందని డెలాయిట్ ఇండియా భాగస్వామి రోహింటన్ సిధ్వా అంటున్నారు. ఇక ఫైనాన్షియల్ ఇయర్, ప్రీవియస్ ఇయర్, అసెస్‌మెంట్ ఇయర్ అంటూ ట్యాక్స్‌పేయర్స్ తికమకపడిపోతున్నారని, కొత్త బిల్లులో వీటన్నింటినీ తొలగించి ట్యాక్స్ ఇయర్ పదాన్ని తేవడం బాగుందని శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కో పార్ట్‌నర్ గౌరి పురి అన్నారు. సాధారణ పన్ను చెల్లింపుదారులకు కూడా అర్థమయ్యే రీతిలో ఐటీ చట్టం ఉంటే ఆహ్వానిస్తామని ఏకేఎం గ్లోబల్ ట్యాక్స్ పార్ట్‌నర్ అమిత్ మహేశ్వరి అన్నారు.

## నెమ్మదించిన పారిశ్రామికోత్పత్తి

**డిసెంబర్‌లో 3 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.2 శాతంగా నమోదు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: పారిశ్రామిక రంగం నెమ్మదించింది. గనులు, తయారీ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో డిసెంబర్ నెలకుగాను మూడు నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.2 శాతానికి పడిపోయిందని కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గతేడాది సెప్టెంబర్, ఆగస్టు నెలలో ఇంతే స్థాయిలో పారిశ్రామిక ప్రగతి నమోదైంది. 2023 డిసెంబర్ నెలలో నమోదైన 4.4 శాతంతో పోలిస్తే భారీగా పడిపోయింది. డిసెంబర్ నెలలో తయారీ రంగం 3 శాతం వృద్ధిని కనబరచగా, క్రితం ఏడాది నమోదైన 4.6 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. అలాగే గనుల్లో ఉత్పత్తి 5.2 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోవడం వల్లనే పారిశ్రామిక రంగం పడకేసింది. కానీ, విద్యుత్ ఉత్పత్తి మాత్రం 1.2 శాతం నుంచి 6.2 శాతానికి ఎగిసింది. మరోవైపు, నవంబర్ నెల గణాంకాలను కేంద్ర సర్కార్ మార్చివేసింది. గతంలో 5.2 శాతంగా ఉన్నదని వెల్లడించిన గణాంకాలను ఈసారి దీనిని 5 శాతానికి కుదించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో పారిశ్రామిక రంగం 4 శాతం వృద్ధిని నమోదుచేసుకున్నది. అంతక్రితం ఏడాది నమోదైన 6.3 శాతంతో పోలిస్తే మందగించింది. క్యాపిటల్ గూడ్స్ 10.3 శాతం వృద్ధిని కనబరచగా, కన్జ్యూమర్ డ్యూరబుల్ 8.3 శాతం, మౌలిక సదుపాయాలు/నిర్మాణ రంగ గూడ్స్ 6.3 శాతం, ప్రాథమిక వస్తువులు 3.8 శాతం, ఇంటర్మీడియట్ గూడ్స్ 5.9 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేసుకున్నాయి.



### శాంతించిన ధరల సూచీ

గత కొన్ని నెలలుగా దూసుకుపోతున్న ధరల సూచీ కాస్త శాంతించింది. జనవరి నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం ఐదు నెలల కనిష్ఠాన్ని తాకుతూ 4.31 శాతంగా నమోదైంది. కూరగాయలు, కోడిగుడ్లు, పప్పుదినుసుల ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే ధరల సూచీ తగ్గిందని పేర్కొంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ధరల సూచీ 5.1శాతంగాను, అలాగే డిసెంబర్ నెలలో నమోదైన 5.22 శాతం కంటే తగ్గుముఖం పట్టింది. బంగాళాదుంప, కొబ్బరి, వెల్లుల్లి, బఠానీ ధరలు భారీగా తగ్గడం ధరల సూచీ తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషించింది. మరోవైపు, జీరా, అల్లం, ఎండుమిర్చి, బెండకాయ, వంటగ్యాస్ ధరలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయాయి.

## కావేరీ సీడ్స్ ఆశాజనకం

**క్యూ3లో రూ.15 కోట్ల లాభం**

హైదరాబాద్, ఫిబ్రవరి 12: రాష్ట్రానికి చెందిన ప్రముఖ విత్తనాల తయారీ సంస్థ కావేరీ సీడ్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.15.04 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.11.66 కోట్ల లాభంతో పోలిస్తే 29 శాతం వృద్ధిని కనబరిచింది. అలాగే సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.118.47 కోట్ల నుంచి రూ.154.77 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.499 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీవీ భాస్కర్ రావు మాట్లాడుతూ.. గత త్రైమాసికంలో ఆశాజనక పనితీరు కనబరిచినట్లు, వరి–మొక్కజొన్న విత్తనాలకు డిమాండ్ నెలకొన్నదన్నారు. అలాగే గత త్రైమాసికంలో ఎగుమతులు రూ.38.10 కోట్ల నుంచి రూ.18.23 కోట్లకు పడిపోయాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం వల్లనే ఎగుమతులు నీరసించాయని చెప్పారు. ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలానికిగాను రూ.1,044.61 కోట్ల ఆదాయంపై రూ.294.46 కోట్ల లాభాన్ని గడించింది.




### ఫండ్స్‌లోకి 39,688 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: దేశీయ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నాయి. ఒకవైపు స్టాక్ మార్కెట్లు కుదేలవుతున్నప్పటికీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు ఆగడం లేదు. జనవరి నెలలో రూ.39,688 కోట్ల పెట్టుబడులు వచ్చాయని యాంఫీ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. కానీ, డిసెంబర్ నెలలో వచ్చిన రూ.41,156 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే 3.5 శాతం తగ్గాయని పేర్కొంది. దీంతో వరుసగా 47వ నెలలోనూ ఫండ్స్‌లోకి పెట్టుబడులు రావడం విశేషం. మిడ్‌క్యాప్ క్యాటగిరిలో రూ.5,148 కోట్లు, స్మాల్‌క్యాప్ క్యాటగిరిలో రూ.5,721 కోట్ల పెట్టుబడులు తరలివచ్చాయి.

## 6 రోజుల్లో 18 లక్షల కోట్లు ఔట్

- **వరుస నష్టాల్లో స్టాక్ మార్కెట్లు**
- **లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి**
- **సెన్సెక్స్ మరో 123 పాయింట్లు డౌన్**

ముంబై, ఫిబ్రవరి 12: దేశీయ స్టాక్ మార్కెట్లను వరుస నష్టాలు వీడటం లేదు. బుధవారం కూడా సూచీలు నిరాశపర్చాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 122.52 పాయింట్లు లేదా 0.16 శాతం పడిపోయి 76,171.08 వద్ద ముగిసింది. అయితే ఒకానొక దశలో 905.21 పాయింట్లు లేదా 1.18 శాతం నష్టపోయి 76వేల స్థాయి దిగువకు చేరడం గమనార్హం. కానీ తిరిగి కొనుగోళ్ల మద్దతుతో సూచీ కోలుకున్నది. అయినప్పటికీ లాభాల్లోకి మాత్రం రాలేదు. ఇక ఈ నెల 5 నుంచి మార్కెట్లు నష్టాలకే పరిమితమవుతున్నాయి. దీంతో గత 6 రోజుల్లో మదుపరుల సంపద రూ.18,04,418 కోట్లు ఆవిరైపోయింది. సెన్సెక్స్ 2,412.73 పాయింట్లు దిగజారింది మరి. మంగళవారం ఒక్కరోజే 1,018.20 పాయింట్లు క్షీణించిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం లక్ష కోట్ల రూపాయలకు పైగా బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ హరించుకుపోయింది. ప్రస్తుతం ఈ విలువ రూ.4,07,46,408.11 కోట్లుగా ఉన్నది. ఇదిలావుంటే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 26.55 పాయింట్లు లేదా 0.12 శాతం తగ్గి 23,045.25 వద్ద నిలిచింది. ఇంట్రా–డేలో 273.45 పాయింట్లు లేదా 1.18 శాతం పతనమై 23వేల మార్కుకు దిగువన 22,798.35 వద్దకు పడిపోయింది. 6 రోజుల్లో 694 పాయింట్లు లేదా 2.92 శాతం తగ్గింది.



### వీడని భయాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు వాణిజ్య యుద్ధానికి దారి తీస్తాయన్న అంచనాలు మదుపరుల్లో బలంగా నెలకొన్నాయి. మరోవైపు విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకుంటూనే ఉండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరుస్తున్నది. బుధవారం ఒక్కరోజే రూ.4,969.30 కోట్ల పెట్టుబడుల్ని ఉపసంహరించుకున్నారు.



పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట

ఎదులాపురం, ఫిబ్రవరి 12: ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మాజీమంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం అదిలాబాద్ రూరల్ మండలం వాన్‌వాట్ గ్రామంలో హీరాసుక జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామస్తులు జోగు రామన్నకు సంప్రదాయ వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతీ ఆచారాలను కాపాడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. నేడు ఆదివాసీ పండుగలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఆదివాసులకు పోడు భూమి పట్టాలు అందించి రైతుబంధు అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కుమ్రం భీం ఆశయ సాధనలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసీ గిరిజనులకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో కిషన్, దమ్మపాల్, మోతీరాం, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## భారతీయ సామాజిక కార్యకర్తలతో సమావేశం

ఎదులాపురం, ఫిబ్రవరి 12: పైలెట్ ప్రజావాణి, ప్రజాఫిర్యాదుల పరిష్కార బహిరంగ విచారణలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తన క్యాంపు కార్యాలయంలో రాజస్థాన్ నుంచి వచ్చిన భారతీయ సామాజిక కార్యకర్త మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, సివిల్ సొసైటీ యాక్టివిటీ నిఖిల్ డేతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి మండలంలో ఎంపీడీవో కార్యాలయాలలో ఫెసిలిటీస్ సెంటర్లు ప్రారంభించి ప్రతి మండలంలోని అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించి వెనువెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. దేశంలోనే ఇంత మంచి కార్యక్రమాన్ని అదిలాబాద్‌లో ప్రారంభించి ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నందుకు ప్రత్యేకంగా కలెక్టర్‌ను అభినందించారు. ఈ సమావేశంలో కిసాన్ మిత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ హర్ష, తదితరులు పాల్గొన్నారు.

### సాఫ్ట్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ

ఎదులాపురం, ఫిబ్రవరి 12 : విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే నైపుణ్యాలను కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ జే సంగీత అన్నారు. తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో టాస్క్ సౌజన్యంతో కమ్యూనికేషన్ నైపుణ్యాలపై బుధవారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కళాశాల టీఎస్ కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ శ్రావణి, టీఎస్ కేసీ మోటార్ ఎండీ ఇమ్రాన్ అలీ, టాస్క్ శిక్షకుడు మార్క్ లూయిస్ హార్నీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 12 : పదో తరగతి పరీక్షల నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి సూచించారు. బుధవారం ఆదిలాబాద్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో హెచ్‌ఎం, సెక్టోరియల్ అధికారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులను గ్రూపులుగా విభజించి వారి ప్రతిభపై ఆరా తీయాలన్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ సాధించేలా కృషి చేయాలని వివరించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించేల చూడాలని, ఉపాధ్యాయులు రోజు వారి రుచులు చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, ఏడీ వేణుగౌడ్, ఏసీజీ వేణుగోపాల్ రెడ్డి, సెక్టోరియల్ అధికారులు సుజాత్ ఖాన్, ఉస్మాన్, శ్రీకాంత్ గౌడ్, నారాయణ, కేజీబీవీ ఎస్‌వోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి

### హెచ్‌ఎంలు బాధ్యతగా వ్యవహరించాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 12: విద్యార్థుల అభ్యున్నతికి ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ కలెక్టరేట్‌లో ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయుల సేవలు ఎంతో తోడ్పడుతాయని, జిల్లాలో నిర్వహించే అన్ని పనులు, ఆపార్, యూ డైస్ ప్లస్ వివరాల నమోదు, ఎండీఎం నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. డీఈవో రామారావు మాట్లాడుతూ మండల విద్యాధికారులు తమ బాధ్యతతో ప్రతి పాఠశాలను సందర్శించి వివరాలు అన్ని నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ, కోఆర్డినేటర్ రాజేశ్వర్, నర్సయ్య, ప్రవీణ్, లింబాద్రి, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీలో సందడి చేస్తున్న మై విలేజ్ షో బృందం

## ట్రిపుల్ ఐటీలో మై విలేజ్ షో బృందం

బాసర, ఫిబ్రవరి 12 : బాసర ట్రిపుల్‌టీలో బుధవారం మై విలేజ్‌షో బృందం సందడి చేశారు. ఇష్ట గోష్టిలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఓఎస్‌డీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. తెలంగాణలోని అత్యంత ప్రసిద్ధ డిజిటల్ సృష్టికర్తలు, వ్యవస్థాపకులను ఒక చోట చేర్చిన ప్రేరణాత్మక కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిగ్‌బాస్ ఫేమ్ గంగవ్వ, మైవిలేజ్‌షో వ్యవస్థాపకుడు శ్రీకాంత్, కీలక సభ్యుడు చందు, ప్రముఖ ఇనస్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్ స్టిఫెన్ భాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన కథలు, సవాళ్లు, కంటెంట్ సృష్టి, వ్యవస్థాపకత, డిజిటల్ వృద్ధిపై విలువైన విషయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో 2వేలకు మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్టేటివ్ ఆఫీసర్ రణదీర్‌సాగి, డాక్టర్ రాకేశ్‌రెడ్డి, ఐఐఈడీ కోఆర్డినేటర్, విద్యార్థులు పాల్గొన్నారు.

### భోరజ్ చెక్ పోస్టువద్ద తనిఖీ కేంద్రం ప్రారంభం

జైనథ్, ఫిబ్రవరి 12 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడంతో భోరజ్ ఉమ్మడి తనిఖీ కేంద్రం వద్ద ఆదిలాబాద్ జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి వినోద్‌దేశ్‌పాండే, ఆదిలాబాద్ డాక్టర్ సతీశ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లను తెలంగాణ రాష్ట్రానికి రవాణాకు వస్తే తిరిగి అదే ప్రాంతానికి వాహనాలు పంపిస్తున్నారు. ఈ తనిఖీని మూడు సిఫ్ట్‌లుగా ఉంటామని అన్నారు. ఉదయం ఆదిలాబాద్ డాక్టర్ సతీశ్, వెటర్నరీ అసిస్టెంట్ సతీశ్, మధ్యాహ్నం జైనథ్ మండల పశు వైద్యాధికారి వినోద్ దేశ్‌పాండే, వెటర్నరీ అసిస్టెంట్ విశాల్, సాయంత్రం గిమ్మ పశు వైద్యాధికారి సిద్ధార్థ్, వెటర్నరీ అసిస్టెంట్ ముజీబ్ తనిఖీలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. భోరజ్ ఉమ్మడి తనిఖీ కేంద్రం ఎంవీఐ ప్రదీప్‌కుమార్ గౌడ్, ఏఎంవీఐ మోహన్ గౌడ్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పశు వైద్యాధికారులు

## అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట

బేల, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేస్తుందని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని సరిహద్దులో ఉన్న పెనుగంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం మేరకు బుధవారం పోలీసులు రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. కాంగాపూర్ నదిలో నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అలాగే మండలంలోని సాంగిడి, కాంగార్‌పూర్ గ్రామాల నుంచి రాత్రి సమయాల్లో బోటింగ్‌ల ద్వారా ఇసుక తరలిస్తున్నారని ఇకపై అక్రమ ఇసుక రవాణా చేసి ఇసుక తరలించినట్లయితే వాహనాలు సీజ్ చేయడమే కాకుండా వారిపై దొంగతనాల కేసులు పెడతామని హెచ్చరించారు. వారి వెంట జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్, బేల ఎస్ఐ దివ్యభారతి, డీటీ వామన్‌రావ్, ఆర్ఐ అశోక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



కాంగార్‌పూర్ నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి, అధికారులు

### పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి కృషి చేయాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 12 : ప్రజలు స్వచ్ఛందంగా పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు కోరారు. బుధవారం ఆదిలాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నుల వసూలు కోసం పట్టణంలో 19 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం పెండింగ్‌లో ఉన్న పన్నుల ఇండ్లకు వెళ్లి వసూలు చేస్తున్నారన్నారు. మొండి బకాయిలున్న 450 మందికి రెడ్ నోటీసులు అందించామని తెలిపారు. సమయంలోగా చెల్లించకపోతే వారి ఆస్తులను మున్సిపల్ స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. మొండి బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ నిర్లక్ష్యంగా ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. వంద శాతం వసూలు చేసేల ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇందులో భాగంగానే ఈ సంవత్సరం రూ.17 కోట్ల వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.6 కోట్లు వసూలు చేశారు. రూ.4 కోట్ల పన్నులు వివిధ కోర్టు కేసుల్లో ఉన్న ఆస్తులకు సంబంధించినవిగా ఉన్నాయన్నారు. పట్టణంలో మొత్తం 48,354 అసిస్‌మెంట్ ఉన్నాయి. ఇందులో నాన్ రెసిడెన్షియల్ 4897, రెసిడెన్స్ 41957, ఇతర ఇండ్లు, ప్లాట్లు 1500 ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.17 కోట్ల వసూళ్లకు గాను రూ.6 కోట్లు కలెక్షన్ చేయగా మిగతా వాటిని మార్చి 31వ తేదీలోగా వసూలు చేసేల ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. పట్టణంలో వంద శాతం ట్యాక్స్ కలెక్షన్‌కు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

### హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

నిర్మల్‌చైన్‌గేట్/ఖానాపూర్ టౌన్, ఫిబ్రవరి 12: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పును వెలువరించినట్లు ఖానాపూర్ సీఐ సైదరావు తెలిపారు. వివరాలకు వెళ్తే.. ఖానాపూర్‌లోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన చెట్‌పెల్లి అలేఖ్యను అదే కాలనీకి చెందిన జూకింది శ్రీకాంత్ ప్రేమపేరుతో వేధింపులకు గురిచేసేవాడు. 2024 ఫిబ్రవరిలో 8వ తేదీన టైలరింగ్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. మృతురాలి అన్న గణేశ్ ఫిర్యాదు మేరకు ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ లింబాద్రి కేసు నమోదు చేశారు. దీంతో అప్పటి సీఐ మోహన్ నేరపరిశోధన చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ప్రస్తుత సీఐ సైదరావు చార్జ్‌షిట్‌ను కోర్టులో సమర్పించగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 27 మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదనలు విన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితునికి జీవితకాల కఠినకారగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

### సొనాలలో చోరీ

బోథ్, ఫిబ్రవరి 12: సొనాలలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. షేక్ ఉస్మాన్ అనే వ్యాపారి ఇంట్లో అర్ధరాత్రి ఇంటి తాళం పగలగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆరు తులాల బంగారం ఆభరణాలు, 18 తులాల పట్టగొలుసులు, నగదును దోచుకెళ్లారు. పెండ్లి వేడుకకు వెళ్లి తిరిగి వచ్చిన కుటుంబీకులు దొంగతనం విషయమై పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటేశ్వర్‌రావ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాలను సైతం పరిశీలిస్తున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.